ప్రజాశక్తి
బుధవారం 22 అక్టోబర్ 2025
5



ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నలుగురు విద్యార్థుల మరణాలకు ఉపాధ్యాయులను బాధ్యులు చేస్తూ సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రక్షిత మంచినీరు లేకపోవడం, సరిపడేలా మరుగుదొడ్లు లేకపోవడంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని చెప్పారు. పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయాలు కల్పించకుండా విద్యార్థుల మృతికి ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం సరికాదని మురళీమోహన్ రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో

పోలీసుల పాత్ర అభినందనీయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అభినందనీయమని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి కొనియాడారు. పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోలీస్ అమరులకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి, ఎఎస్‌పి అంకిత సురానా భాగస్వామ్యమై పోలీస్ అమరులకు పుష్పాంజలి ఘటించారు. ముందుగా సాయుధ బలగాల నుంచి కలెక్టర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలీస్ శాఖ పనితీరును, ప్రభుత్వ సహకారాన్ని ప్రశంసించారు. దేశభద్రతకు ప్రజల కోసం విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు ఆటుపోట్లను ఎదుర్కొంటూ సత్యాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని కాపాడే బాధ్యతతో ధైర్యంగా శత్రువులను తిప్పికొట్టడం పోలీసుల త్యాగాలకు నిదర్శనమన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న పోలీసుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉన్నప్పటికీ, పోలీసులు విధి నిర్వహణలో రాజీలేని పోరాటం చేస్తూ తీవ్రవాద చర్యలను ఎదిరించడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమైన పాత్ర పోషిస్తూనే ఉన్నారని ప్రశంసించారు. పోలీస్ శాఖకు రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం మరువలేనిదన్నారు. పోలీసుల సంక్షేమానికి, అలాగే వారిని ప్రోత్సహించడానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకమని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. పోలీస్ సిబ్బందికి పారితోషికాలు, సత్కారాలు, పదోన్నతులను కల్పిస్తూ అన్ని విధాలా సిఎం మంచి ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. అంతకుముందు జిల్లాలో వివిధ ఘటనల్లో అమరులైన పోలీసుల కుటుంబ సభ్యులకు సహాయంగా చెక్కులను అందజేశారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సమసమాజానికి సేవలందించేందుకు తాను ఓ పోలీసుగా గర్వపడుతున్నట్లు చెప్పారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకోవడం మన బాధ్యతని, ప్రజల ధన, మాన, ఆస్తుల పరిరక్షణ, శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసు శాఖ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. పోలీసులు చూపించిన ధైర్య సాహసాలు, నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు. విపత్కర పరిస్థితుల్లోనూ, శాంత్రిభద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక శక్తులతో పోలీసులు నిరంతరం పోరాడుతున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. సమాజానికి స్వేచ్ఛను అందించేది పోలీసులు మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలకొండ డీఎస్పీలు ఎ.రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, జిల్లా సీఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.



అమరులకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి



అమరుల కుటుంబాలకు పండ్లును అందజేస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే

పోలీసు అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరులైన స్వర్గీయ బి.శ్రీరాములు భార్య ప్రమీల, కుటుంబ సభ్యులు, సూర్యనారాయణ భార్య రాజు, కుటుంబ సభ్యులతో మమేకమై, వారి యోగ క్షేమాలు, పిల్లల చదువు గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం పోలీసు అమరుల కుటుంబాలతో కలిసి జిల్లా ఎస్పీ అల్పాహారం చేసి, వారితో కొంత సమయాన్ని గడిపారు. పోలీసు అమరుల కుటుంబ సభ్యులకు పండ్లు, నగదును కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి, ఎమ్మెల్యే విజయచంద్ర చేతుల మీదుగా జిల్లా ఎస్పీ అందించారు. ఎప్పుడు ఏ అవసరమున్నా పోలీసు అమరుల కుటుంబ సభ్యులు తమను సంప్రదించవచ్చునని భరోసా ఇచ్చారు.

టారిఫ్‌లకు నిరసనగా ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - బలిజిపేట

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన టారిఫ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు, రైతు ,వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, పలగర, నారాయణపురం, చెల్లింపేటలో నరకాసుర వధలో భాగంగా ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బొద్దాన భానుమూర్తి, కౌలు రైతు సంఘం నాయకులు నల్ల ఈశ్వరరావు, మాట్లాడుతూ ట్రంప్ భారతదేశ ప్రజలను వలసదారుల పేరుతో ఉద్యోగులను సంకెళ్లు వేసి వెనక్కి పంపించి దేశం పరువు తీసిన ట్రంప్ అడుగులకు మడుగులొత్తే మోడీ లొంగుబాటు విధానంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం భారతదేశంతో సహా ప్రపంచ దేశాలన్నింటి పైనా తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మన వ్యవసాయ రంగాన్ని ధ్వంసం చేస్తుందని, పారిశ్రామికోత్పత్తిని దెబ్బతీస్తుందని, సేవారంగం గందరగోళంలో పడుతుందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో పత్తి మొక్కజొన్న, ఆక్వా, టెక్స్టైల్, గార్మెంట్, పట్టు వంటి రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. దీంతో ఉద్యోగులు, కార్మికులు, మరోవైపు రైతాంగం రోడ్డునపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ పరిస్థితిని ఎదుర్కొని మన దేశ ప్రయోజనాలు కాపాడుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను అందిపుచ్చుకోవాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇందుకు వ్యతిరేకంగా ట్రంప్ చర్యలను నిరసిస్తూ ప్రజలు, కార్మికులు, రైతులు ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గంట్యాడ బలరాము నాయుడు, అప్పన్న, జోజి,నాయుడు, అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: దీపావళి నరకాసుర వధ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని పెదబోగిల పంచాయతీలో బుడ్డిపేటలో ట్రంప్ దిష్టిబొమ్మల దగ్ధం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, రాయిపల్లి రాము, మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఉద్యమించాల్సిన తరుణమిది అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన ప్రజల ప్రయోజనాలు కాపాడే వైఖరి తీసుకొనేలా ఒత్తిడి పెంచాలి, ట్రంపు విధించే సుంకాలకు చైనా, రష్యా, మెక్సికో ఇతర దేశాలు వ్యతిరేకించాయన్నారు. మన ప్రభుత్వాలు లొంగుబాటు ధోరణికి వ్యతిరేకంగా ట్రంప్ చర్యలను నిరసిస్తూ ప్రజలు, ప్రజాసంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పి.రమేష్, పి.చిన్నారావు, వై.రామారావు, ఎం.అచ్యుతరావు, బి.శివున్నాయుడు పాల్గొన్నారు.



బలిజిపేటలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

పాఠశాలలో పరిశుభ్రత వారం

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఐటిడిఎఫ్ పరిధిలో గల అన్ని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలో పరిశుభ్రత వారం కార్యక్రమం నిర్వహించాలని ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వారాలను బట్టి నీటి వసతుల నిర్వహణ, పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, వాష్ వీక్ కార్యక్రమం నిర్వహించాలన్నారు.



జీపు జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

జీపుజాతాను జయప్రదం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కురుపాం

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 27 వరకు మన్యం జిల్లాలో చేపడుతున్న జీపు యాత్రలో విద్యార్థులు, మేధావులు, గిరిజన సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర పోస్టుమెట్రిక్ హాస్టల్ వద్ద విద్యార్థులతో కలిసి జీపు యాత్ర గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ మండల కేంద్రంలో గల గురుకుల పాఠశాలలో వారం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు అనారోగ్యం బారినపడి మృతి చెందడం దారుణమనానరు. అంతేకాకుండా రామభద్రపురం, కొమరాడ కెజిబివి, గుమ్మలక్ష్మీపురం బాలికల పాఠశాలలో, ఇలా సుమారు 11మంది విద్యార్థులు ఈ ఏడాదికాలంలోనే మృతి చెందారన్నారు. దీనికి కారణం హాస్టళ్లలో సరైన మౌలిక వసతులు లేకపోవడమేనన్నారు. అంతేకాకుండా కనీసం విద్యార్థుల ఆరోగ్యాన్ని చూడడానికి ఎఎన్ఎంలు కూడా లేకపోవడం అన్యాయమన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చేసిన మొదటి సంతకాన్ని కూడా కనీసం అమలు చేయకపోవడం అంటే గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ఈ ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, హాస్టల్లో మౌలిక వసతులు లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అయితే పాఠశాల హెచ్ఎంలను, వార్డెన్లను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించ పోవడంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీపుయాత్ర చేపట్టామని, ఇప్పటికైనా గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థినులు అంజలి, కల్పన కుటుంబాలకు రూ.50 లక్షలు నష్టపరిహారం ఇచ్చి, ఇంటిలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, అనారోగ్యం బారినపడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించాలని, గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, టి.అనిల్, ఉపాధ్యక్షులు ఎ.గంగారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాణసంచా పేలుళ్ల బాధితులకు

మెరుగైన వైద్యం, పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

బాణసంచా పార్సిల్, కొరియర్ సర్వీస్‌లో బాణాసంచా పేలుళ్ల వల్ల గాయపడిన ఆర్టీసీ కళాసీ రెడ్డి రమేష్, అద్దె బస్సు డ్రైవర్ తెర్లి రవికి మెరుగైన వైద్యం అందలేదని, వారి కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్గో పార్సెల్ సంస్థ నష్ట పరిహారం చెల్లించాలని మంగళవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, జిల్లా నాయకులు బంకురు సూరిబాబు తదితరుల ఆధ్వర్యంలో నిరసన తెలిపి, కలెక్టర్ ప్రభాకరరెడ్డికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో బాణా సంచా పార్సెల్ దించే క్రమంలో జరిగిన పేలుళ్లలో కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కళాసీ రెడ్డి రమేష్, అద్దె బస్సు డ్రైవర్ తెర్లి రవి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు ఆర్టీసీ కార్గోపార్సెల్ సర్వీస్ విభాగం, సంస్థ అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారి నుంచి బాధితులకు నష్టపరిహారం వసూలు చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. విశాఖ కెజిహెచ్‌కు తరలించినా నాణ్యమైన వైద్యమందలేదని కుటుంబ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి నిబంధనల ప్రకారం బస్సులో నిషేధిత, ప్రమాదకర వస్తువులు రవాణా చేయకూడదని దాన్ని గమనించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీని కారణంగా ఆర్టీసీ కళాసీలు ప్రమాదస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారని, వీరందరికీ మెరుగైన మంచి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రెడ్డి రమేష్‌కు వైద్యం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని, ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ఆర్టీసీ అధికారులు తక్షణమే మెరుగైన వైద్యమందించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆ కుటుంబానికి యాజమాన్యం కార్గో సంస్థ నగదు సహాయం చేసి వైద్య ఖర్చులు అందించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కళాసీలకు, అద్దె బస్సు డ్రైవర్లకు ప్రమాద బీమా ఆర్టీసీ సంస్థ చేయించాలని, పార్సిల్ బుక్ చేసినప్పుడు డిజిటల్ స్కానింగ్ చేసి ఆ సరుకు వివరాలు బహిర్గతం పరచాలని, పార్సిల్ బుక్ చేసిన వారి డిక్లరేషన్ కూడా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కళాసీ యూనియన్ నాయకులు భానుమూర్తి, ఎం.అప్పలనాయుడు, మరిశర్ల వెంకటనాయుడు, రాగాల నీలరాజు, పడాల పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు..

సిపిఎం, సిఐటియు డిమాండ్



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు, కళాసీలు

బాధితులను పరామర్శించిన అడిషనల్ మెజిస్ట్రేట్

పట్టణంలో ఇటీవల జరిగిన దీపావళి సామగ్రి పేలుడు ఘటనలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె గాయపడిన వారితో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి వైద్యుల నుంచి చికిత్స వివరాలు తెలుసుకొని అవసరమైన వైద్యసేవలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గాయపడిన వారికి న్యాయ సేవా కమిటీ తరఫున ధైర్యం చెబుతూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయ సేవా కమిటీ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక న్యాయవాదులు పాల్గొన్నారు



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడ్ని పరామర్శిస్తున్న జడ్జి సౌమ్య జాస్పిన్



ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటుతున్న కుంతేసు గ్రామస్తులు

ఏజెన్సీలో పొంగిపొర్లుతున్న గెడ్డలు, వాగులు

ప్రమాదకరంగా ప్రజల రాకపోకలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గెడ్డలు, వాగులు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలతో పలు ప్రాంతాల్లో వాగులు, గెడ్డలు దాటాల్సిన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రా -ఒరిశా సరిహద్దు ప్రాంతంలో వర్షాలు కురవడంతో నదుల్లో నీటి ప్రవాహం పెరిగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని నాగావళి, జంఝావతి నదుల్లో భారీగా వరద నీరు చేరింది. వరద నీరు పోటెత్తడంతో రెండు నదుల్లో కూడా నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో ఒడిశా ప్రాంత సమీపంలో కొమరాడ ఏజెన్సీ గ్రామీణ కుంతెసు గ్రామానికి వెళ్లే దారిలో కొండవాగు గెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అత్యవసర పరిస్థితుల్లో గిరిజనుకు కొండవాగు గెడ్డ పై నుంచి ప్రమాదకరంగా నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎటువంటి అనారోగ్యం బారిన పడినా ఈ గెడ్డను దాటుకుని రావాలంటే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అకాల వర్షాలకు నది గెడ్డలు, వాగులు, వంకలు, పరివాహక ప్రాంతాల ప్రజలు నీటి ప్రవాహం వద్దకు వెళ్లకూడదు అని అధికారులు సూచిస్తున్నారు.

తప్పని డోలీ మోత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మహేంద్రపురం గ్రామానికి చెందిన కొండగొర్రి తుని అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో సోమవారం ఆమెను గెడ్డ దాటించేందుకు డోలీపై మోసుకొని నీలకంఠాపురం పిహెచ్‌సికి తరలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీలకంఠాపురం, మహేంద్రపురానికి మధ్య ఉన్న గెడ్డవాగు పొంగి అధికంగా వరద వచ్చింది. దీంతో కుటుంబీకులు డోలీపై ఆమెను గెడ్డ దాటించి ఆసుపత్రికి తీసుకెళ్లారు

పారదర్శకంగా ధాన్యం సేకరణ : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మిల్లర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి స్పష్టం చేశారు. మండలంలోని వెంకంపేటలో గల వెంకట బాలాజీ మోడరన్ రైస్ మిల్లును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గన్నీ బ్యాగుల నాణ్యతను పరిశీలించిన ఆయన, రైతులకు చిరిగిన గోనె సంచులు లేకుండా మంచివి అందజేయాలని తెలిపారు. అలాగే రైతులకు తగినన్ని గన్నీ బ్యాగులను సరఫరా చేయాలని, అందుకు తగిన విధంగా బ్యాగులను సిద్ధంగా ఉంచుకోవాలని అన్నారు. జాప్యం లేకుండా సకాలంలో సజావుగా ధాన్యం సేకరణ చేయాలని, మిల్లర్ల ద్వారా పారదర్శకంగా సేకరణ ప్రక్రియ జరగాలని కోరారు. కస్టోడియన్ అధికారి, పిపిసి సిబ్బంది ముందు తేమ పరీక్ష నిర్వహించాలని సూచించారు. ధాన్యం సేకరణలో ముందస్తు కార్యకలాపాలతో రైస్ మిల్లర్లు సిద్ధం కావాలని అన్నారు. సాయంత్రం 5గంటల వరకు ట్రక్ షీట్లు జనరేట్ అవుతాయని, అందుకు తగిన విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. అనంతరం చినబొండపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పిపిసి వద్ద అందుబాటులో ఉన్న అన్ని రికార్డులను, పరికరాలను పరిశీలించి, టార్పాలిన్లు, సిబ్బంది లభ్యతను జెసి అడిగి తెలుసుకున్నారు. గతంలో తలెత్తిన లోటుపాట్లు పునరావృతం కాకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో ముందుగా నిర్ణయించిన షెడ్యూలింగ్ ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని, ఇందులో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగరాదని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని, ధాన్యం సేకరణలో రైతులు, మిల్లర్లు, రవాణా పరమైన ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలన్నారు. ముందస్తు ప్రణాళికతో ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో సీఎస్డిటీలు, మిల్లర్లు, ఆర్ఎస్కె సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.



రైస్ మిల్లులో గోనె సంచులను పరిశీలిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

హైడ్రో పవర్ ప్రాజెక్టు రాకుండా చూడండి

మంత్రికి గిరిజనుల అభ్యర్థన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలో గల దుగ్గేరు ప్రాంతంలో పంపుడు స్టోరేజ్ హైడ్రోప్లవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కాకుండా చూడాలని గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మిడి సంధ్యారాణిని ఈ ప్రాంత గిరిజనులు అభ్యర్థించారు, మంగళవారం పనసభద్ర యువత ఆధ్వర్యంలోనే స్థానిక గిరిజనులు మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంతంలో ప్రతిపాదిత విద్యుత్ ప్రాజెక్ట్ రాకుండా చూడాలంటూ వినతిపత్రం అందచేశామన్నారు. గిరిజనుల అభిప్రాయం ఎంతో ముఖ్యమైనదని, అందరూ కలిసి ఒక సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రజల నిర్ణయానుసారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకువెళ్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పనసభద్ర పంచాయతీ గిరిజనులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ : ఫ్యాప్టో

ప్రజాశక్తి - సీతానగరం

విద్యా బోధనకు ఆటంకం కలిగించే బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్లు మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య తెలిపింది. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశాన్ని మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య బహిష్కరించింది. ఈ మేరకు ఎంఇఒ ఎం.వెంకటరమణకు వినతిని అందజేశారు. భవిష్యత్తులో బోధనేతర కార్యక్రమాల బహిష్కరణ కొనసాగుతుందని ఫ్యాప్టో నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఫ్యాప్టో మన్యం జిల్లా అధ్యక్షులు పి.కూర్మినాయుడు, యుటిఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాదరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.గోవిందరావు, ఎపిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు పి. సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యంనాయుడు, పిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడు సిహెచ్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎప్పుడొస్తారో... ఎప్పుడెళ్తారో?

కానరాని ఇరిగేషన్ డిఇ జాడ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుమ్మిడి గెడ్డ, వట్టిగెడ్డ, మంటికొండ డాం దిగువ ఉన్న ఆయకట్టు రైతులకు సకాలంలో సక్రమంగా సాగు నీరందించి సస్యశ్యామలంగా పంటలు పండేలా చూడాలనే లక్ష్యంతో ప్రభుత్వం కురుపాంలో ఇరిగేషన్ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీరింగ్ అధికారితో పాటు ఐదుగురు అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం మంచిదే అయినా ఆ లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఇందుకు నిదర్శనం ఇక్కడి కార్యాలయంలో పనిచేస్తున్న డిఇ విధులకు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు వెళ్తున్నారో ఎవరికీ అంతుపడడం లేదని స్థానికులు, రైతులు ఆరోపించారు. అసలే పూర్తిస్థాయి సిబ్బంది లేరు. కేవలం ఇద్దరు డిఇలకు ఒకరే ఉన్నారు. అలాగే ఐదుగురు ఎఇలకు ఇద్దరే ఉన్నారు. అరకొర సిబ్బందికి తోడు సిబ్బందిని అందర్నీ గాడిలో పెట్టాల్సిన అధికారి జాడే కారవడంలేదు. ఆయను ఎప్పుడు విధులకు వస్తారో ఎక్కడికి వెళ్తారో కనీసం కింద స్థాయి సిబ్బంది కూడా చెప్పరు. దీంతో డిఇ పనిమీద వచ్చిన రైతులు, తదితరులు ఫోన్ చేస్తే జిల్లా కేంద్రంలో ఉన్నానని, క్వాలిటీ కంట్రోల్ పని మీద బొబ్బిలి వెళ్లానని ఇలా వివిధ కారణాలు చెప్పుకొస్తున్నారు. ఎప్పుడూ కురుపాం కార్యాలయంలో అందుబాటులో లేకుండా ఉంటున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నియోజకవర్గ కేంద్రమైన కురుపాం ఇరిగేషన్ కార్యాలయంలో డిఇ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



డిఇ లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ



రీసర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

రీసర్వేను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని ఇప్పలవలసలో జరుగుతున్న రీసర్వేని, ఎఫ్ఒపిఎల్ఆర్‌ను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేస్తూ దిశా నిర్దేశం చేశారు. సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి రీసర్వే చేపట్టాలని, ఎక్కడా ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. అదే సమయంలో పూర్తిస్థాయిలో రికార్డ్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్‌లు కూడా పక్కాగా ఉండాలని, పూర్తి చేసిన మేరకు రికార్డులన్నీ పారదర్శకంగా ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు, సిబ్బందికి మార్గ దర్శకాలను జారీచేశారు. ఈ పర్యటనలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పనులను పరిశీలిస్తున్న ఇఇ రవికుమార్

డిసెంబర్ నాటికి గృహ నిర్మాణాలు పూర్తి : ఇఇ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో ఈ ఏడాది డిసెంబర్ నాటికి గృహ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రవికుమార్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గంగంపేట, శాంతిగూడ, గడగమ్మ గ్రామాల్లో ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన బిల్లులు కూడా దశలవారీగా చెల్లింపులు జరుగుతున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎఇ వి.వినోద్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పట్టణ అధ్యక్ష రేసులో పలువురు నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుత ఉన్న పట్టణ టిడిపి అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ మూడుసార్లు ఈ పదవి చేపట్టడంతో ఈసారి మార్పు అనివార్యం కావడంతో పలువురు పోటీపడుతున్నట్లు తెలుస్తుంది. అయితే గ్రూపులు ఎక్కువ కావడంతో ఒకరంటే ఒకరు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ప్రధానంగా చొంగ శివానంద, గుమ్మడి సింహాద్రి, తమ్మారావు, అడపా బాబ్జీ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వస్తున్నప్పటికీ టిడిపి కేడర్ అంతా ఆయనతోనే కొనసాగుతుంది. దీంతో ఈ పదవిపై ఒక స్పష్టత రాలేదు. ఎమ్మెల్యే ఆశీస్సులో ఎవరికి ఎక్కువగా ఉంటే వారికే పదవి దక్కుతుందన్న చర్చ జరుగుతోంది.

నవగాం సచివాలయం పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని నవగాం సచివాలయాన్ని ఎంపిపి బొమ్మల భాను సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు బాధ్యతగా సేవలందించాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట మండల ప్రత్యేక ఆహ్వానితులు జాడ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

25లోగా ఇ- క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 25లోగా రైతులు ఇ6 పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎస్.అవినాష్ కోరారు. మండలంలోని లక్ష్మీపురం, పెదబోగిలిలో ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 83శాతం పంట నమోదు చేయడం జరిగిందన్నారు. మిగతాది ఈ25లోగా పూర్తి చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి వెంటనే పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

పత్ర ద్రావణంతో బహుళ ప్రయోజనం

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రకృతికి సాగుకు పలుపత్ర ద్రావణంలో అనేక ప్రయోజనాలు ఉంటాయని, వీటిని వినియోగించుకోవాలని ఎంటి, ఎంసిఆర్‌పి టి.శ్రీరాములు, లక్ష్మి అన్నారు. మండలంలోని పనుకువలసలో బయో ఇన్పుట్ సెంటర్ వద్ద శ్రీరాములు, లక్ష్మి సమక్షంలో ఐసిఆర్‌పి, బయో ఇన్పుట్ సెంటర్ యజమానులు తిరుపతిరావు, బంకపల్లి సింహాచలం నాయుడు 200 లీటర్ల పలు పత్ర ద్రావణాన్ని తయారు చేశారు. దీని తయారీకి మన చుట్టూ నిరుపయోగంగా పడి ఉన్న వివిధ రకాల ఆకులను పచ్చిమిర్చి, వెల్లుల్లి పొగాకు రద్దు పేస్టును ఉపయోగించారు. ప్రకృతి వ్యవసాయంలో దీన్ని గ్రోత్ బూస్టర్ గాను, సూక్ష్మ పోషక లోపాల నివారణి గాను క్రిమిసంహారిణిగాను, పలు రకాల తెగుళ్ల నివారణ కొరకు ఉపయోగించవచ్చునని వివరించారు.

ప్రతిభా పరీక్షకు 10,200 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పాఠశాల స్థాయి సైన్స్ సంబరాల ప్రతిభ పరీక్షకు జిల్లాలోని 10,200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు జెవివి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కె.గౌర్నాయుడు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు మౌంట్ పోర్టు, తెట్టంగి, బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించినట్లు వారు తెలిపారు. నవంబర్ ఒకటో తేదీన మండల స్థాయిలో జరుగు సైన్స్ ప్రతిభా పరీక్షకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్‌లో స్వర్ణపతకం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గడిగుడ్డికి చెందిన బిడ్డిక హిమశ్రీ అండర్-14 విభాగంలో స్వర్ణ పతకం సాధించి విజేతగా నిలిచింది. ఖేలో ఇండియా స్టేట్ ఉమెన్స్ పెన్ కాక్ సిలాట్ 2025 లీగ్ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ సబ్బవరం, అనకాపల్లి జిల్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్ కాక్ సిలాట్ అసోసియేషన్ మన్యం జిల్లా సెక్రటరీ యం. నరేష్ అభినందనలు తెలిపారు.

ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించి విద్యార్థులకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లుంబేసు గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వినతి అందించారు. ఈ సందర్భంగా మండల సహాయ కార్యదర్శి మండంగి సన్యాసిరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సకాలంలో వైద్యమందక మృతి చెందారన్నారు. మరి కొంతమంది విద్యార్థులు పచ్చకామెర్లతో ఆసుపత్రిలో చేరారన్నారు. స్థానికంగా ఆరోగ్య కార్యకర్తలు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో యువజన సంఘం నాయకులు బిడ్డ రమేష్ పాల్గొన్నారు.

రైల్వే ఫ్లైఓవర్‌కు భూ సేకరణ

ప్రజాశక్తి - కొమరాడ



భూసేకరణ గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

ఆంధ్రా - ఒడిశా అంతర్రాష్ట్ర రహదారిపై మూడు రైల్వే గేట్లు వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ జరుగుతుందని స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం అర్తంలో భూసేకరణకు సంబంధించి రైతులతో గ్రామసభ నిర్వహించారు. విక్రమపురం, అర్తం గ్రామాల మధ్య ఫ్లైఓవర్ నిర్మాణానికి కూడా ఈ పంచాయతీ పరిధిలోనే భూములుండడంతో భూసేకరణకు సంబంధించిన గ్రామసభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. ఈ వంతెన నిర్మాణం జరిగే ప్రదేశంలో అవసరమైన భూసేకరణ చేసి రైతులకు బాధిత రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. జిరాయితీ, డి- పట్టా భూములు గల రైతులకు పరిహారం ప్రభుత్వ నిర్ణయించిన ధరకు చెల్లిస్తుందని, కావున రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ప్రభుత్వ మార్కెట్ విలువ కంటే 2.5 శాతం నగదును అదనంగా కలిపి రైతులకు చెల్లిస్తుందన్నారు. ముఖ్యంగా డి-పట్టా కలిగిన రైతుకు మాత్రమే పరిహారం చెల్లిస్తామని, ఇతరులకు పరిహారం చెల్లించడం జరగదని స్పష్టం చేశారు. కావున రైతులు ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించి అవసరమైన భూములను అధికారులకు అందించాలని కోరారు. గ్రామసభలో రైతులకు ఎటువంటి అభ్యంతరాలున్నా తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ జి.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కె.శంకర్రావు, ఎంపిటిసి సభ్యులు జి.వెంకట నాయుడు, మండల సర్వేర్ వంశీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ ఆరోగ్య వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

గతంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, వసతి గృహాల్లో హెల్త్ వాలంటీర్లుగా విధులు నిర్వహించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ పలువురు హెల్త్ వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ, జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. హెల్త్ వాలంటీర్లకు మద్దతుగా గిరిజన సంక్షేమ సంఘం, ఏఐఎస్ఎఫ్, ఏఐటియుసి, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, బి.రవికుమార్, ఆరికఐస్ కుమార్, తాగాండి, సాయిబాబు, గణేష్, చందు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెల్త్ వాలంటీర్లు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు 24 గంటలు వైద్య సేవలు చేస్తామని తెలిపారు. జీతం తక్కువైనా సమయానికి జీతం ఇవ్వకపోయినా గిరిజన విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడే ప్రయత్నం చేశామని చెప్పారు. తమను విధుల్లోకి తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవిని చేపట్టిన సమయంలో ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేశారు.

వ్యకాస మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురంలో ఈనెల 22న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా పదో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి, మండల నాయకులు రెడ్డి శివున్నాయుడు పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీళ్లు, మజ్జిగలు, పనిముట్లతో పాటు అత్యవసర ఆరోగ్య కిట్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ చట్టానికి రక్షణగా వ్యవసాయ కార్మిక సంఘం నిలుస్తుందని అన్నారు. గిరిజనుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యవసాయ కార్మిక సంఘం వ్యతిరేకిస్తుందని, జిల్లాలో జరుగుతున్న అనేక ప్రజా పోరాటాలకు మద్దతునిస్తూనే ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గత మూడేళ్లలో చేసిన కృషిని సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను, కార్యక్రమాలను రూపొందించుకోడానికి ఈ మహాసభలు దోహదపడతాయ న్నారు. కావున ఈ మహాసభల జయప్రదానికి వ్యవసాయ కార్మికులు, రైతులు, మేధావులు, అభ్యుదయవాదులు ఆర్థిక, హార్దిక సహకారంతో జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న శ్రీరాములు

రోగులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ మంచిపిల్లి శ్రీరాములు ఆహారం పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందడానికి వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులకు పౌష్టికాహారం అందజేశారు. రోగుల సహాయకులకు కూడా ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గంట శ్రీనివాసరావు, సంకా నూకరాజు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బోటు రామకృష్ణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం


మండలంలోని కంబర మండల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న ఇజి.త్రినాధ రావు(56) మంగళవారం మృతి చెందారు. ఈయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈనెల 20న ఒకేసారి ఆవేశం రావడంతో కుటుంబ సభ్యులు వైద్యం కోసం విశాఖ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు. కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య తులసి, కుమారుడు కీర్తి సాగర్, కుమార్తె మైత్రి ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంఇలు గౌరు నాయుడు, ఆనందరావు కంబర వలస వెళ్లి కుటుంబ సభ్యులు వాదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు ఆరోగ్యంపై కూడ శ్రద్ధ తీసుకోవాలని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల పరిసరాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకుంటూ, మౌలిక వసతులు, తాగునీరు సక్రమంగా అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎన్.సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి, ఎటిడబ్ల్యుఒ కె.చంద్రబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వెంటనే స్పందించాలని నోడల్ అధికారి కెసిఆర్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో విద్యార్థుల ఆరోగ్య సమస్యలపై చర్చించారు. అలాగే పిల్లల హాజరు, శానిటేషన్, ఫుడ్, తాగునీటి సదుపాయం, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలుంటే ఎఎన్ఎంలతో మాట్లాడి దగ్గరలో గల ప్రభుత్వ హాస్పిటల్‌కు పంపించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎన్.అర్జునరావు, డిప్యూటీ ఎంపిడిఒ ఎన్.సూర్యనారాయణ, కాశీపట్నం కెవిజిబి ప్రిన్సిపల్, వైఎస్ వలస హెచ్ఎం, ఏకలవ్య పాఠశాల హెచ్ఎం, ఎంఇఒ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎంఇఒ

వీరఘట్టం వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో బి వెంకటరమణ గృహాల అధికారులు ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వసతి సంక్షేమ అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. గృహాల్లో పరిసరాలు పరిశుభ్రతతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలన్నారు. వేడి చేసిన నీరు విద్యార్థులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గృహాల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలను గుర్తించాలి

ప్రజాశక్తి - సీతానగరం

వ్యాధి లక్షణాలు స్పష్టంగా గుర్తించి, నిర్ధారణ చేసి తగు చికిత్స అందించాలని జిల్లా ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జోగింపేట కెజిబివి హాస్టల్‌ను మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమాచారం అడిగి తెలుసుకున్నారు. అందజేసిన చికిత్సా వివరాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. రోగి లక్షణాలు స్పష్టంగా తెలుసుకొని నిర్ధారణ చేయాలని తద్వారా అవసరమైన చికిత్స అందించాలన్నారు. ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షలు, నివేదికలు పరిశీలించారు. జ్వరాలకు రక్త పూతలను సేకరించాలన్నారు. ప్రతి వారం నమోదవుతున్న కుక్కకాటు, పాముకాటు కేసులను తెలుసుకొని ఎఆర్‌వి, ఎఎస్‌వి ఇంజక్షన్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా వైద్య సేవలందించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాలి

అనంతరం జోగింపేట, కెజిబివి హాస్టల్‌ను డాక్టర్ జగన్ మోహన్ సందర్శించి హాస్టల్ పరిసరాలు, సిక్ రూమ్, సిక్ రిజిస్టర్ పరిశీలించారు. విద్యార్థుల అనారోగ్య సమస్యలు, వైద్య పరీక్షలు, చికిత్స వివరంగా తెలిసేలా సిక్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తాగునీటి ఆర్ఒ ప్లాంట్ పనితీరుపై పరిశీలించారు. హాస్టల్ ఎఎన్ఎం, వార్డెన్, వైద్యసిబ్బంది విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని తరచుగా తెలుసుకొని సమస్యల పట్ల తక్షణమే స్పందించాలన్నారు. విద్యార్థులకు రక్తహీనత, సీజనల్ వ్యాధులు, కామెర్లు, పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది విధిగా వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుశీల, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, హాస్టల్ ప్రిన్సిపాల్ జె.సంధ్య, సూపర్వైజర్లు రవణమ్మ, భవాని, గోపాల్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

రబీకి విత్తన కిట్‌లు సిద్ధం

ప్రజాశక్తి - కొమరాడ

రానున్న రబీ సీజన్‌కు ఆర్‌డిఎస్ విత్తనాల కిట్‌లను సిద్ధం చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు అన్నపూర్ణ తెలిపారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో తయారు చేస్తున్న విత్తనాల కిట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 250 కిట్లు తయారీని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ఈ కిట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తనాలు సేకరించి అన్ని కలిపి పంటలకు అనుగుణంగా తయారు చేసి రైతులకు సరఫరా చేస్తామని చెప్పారు. ఈ కిట్‌లో అపరాలు, మొక్క జొన్న, తోటల్లో అంతర్ పంటలుగా వేసుకోవాలనీ రైతులకు సూచించారు. అపరాలతో పాటు తోటకూర, గోంగూర, మొక్కజొన్న, ఆముదం, కంది, బొబ్బర్లు, రాగులు, కూరగాయ విత్తనాలు మొదలగునవి ఒక ఎకరాకు 2 కేజీల విత్తనాలు కలిపి వేసుకోవడం వల్ల భూమి అంతా పచ్చదనంతో కప్పబడి ఉంటుందన్నారు. అపరాలు వేసిన తర్వాత నెల రోజుల్లో తోటకూర, గోంగూర హార్వెస్టింగ్ చేయొచ్చని, అపరాలతో పాటు మిగతా పంటలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని అన్నారు. భూమిని పచ్చదనంతో కప్పి ఉంచడం వల్ల భూమిలో ఉండే తేమను కాపాడకోవచ్చని, భూమిలో ఉండే మేలు చేసే సూక్ష్మ జీవులు పెరుగుతాయని, వేడి తాపాన్ని భూమిపై పడకుండా భూమిలో సేంద్రీయ కర్బ శాతాన్ని పెంచడంభూమినినిత్యం కప్పి ఉంచడం వల్ల సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డిపిఎం శ్రావణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, విఎఎలు, సిబ్బంది, ఎన్ఎఫ్ఎ, ఎంటి, యూనిట్ ఇన్చార్జి, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసంధానంతో డిసెంబరు 13న గుంటూరులో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా గోడ పత్రికను మంగళవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిబ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, విజయనగరం జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు ఇనుగంటి రాకేష్ , భగవాన్ మిశ్రా వేల్పూరి గంగరాజు ,పుత్రేవు సిద్దు, అగస్త్య బన్నీ, పుల్లల శ్రీనివాసరావు, వృద్ధుల శేషు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: ఎపి బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అన్నారు. ఈ సమాఖ్య ఆధ్వర్యంలో డిశంబరు 13న గుంటూరు హిందు ఫార్మసీ కళాశాలలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గోడపత్రికను మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ సేవా సంఘ నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సామాజిక వర్గానికి భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య చేపట్టిన ఈ మంచి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కన్నయ్యవలసలో తూటికాడ కషాయం తయారీ

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన రైతులు వరి పంటను కేవలం తిండి గింజలు మాత్రమే పండిస్తారని గట్ల మీద, చిన్న చిన్న ఖాళీ స్థలాల్లో కూర, ఆకుకూరలు, మిరప వంటివి పండిస్తారని, వీటికి ప్రత్యేకంగా ఎలాంటి పురుగుమందులు, రసాయన ఎరువులు వేయకుండా కషాయాల ద్వారా చీడిపీడలను అదుపులో ఉంచుకోవచ్చని వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కన్నయ్యపలసలో రసం పీల్చు పురుగుల నివారణకు ఉపయోగపడే తూటికాడ కషాయాన్ని తయారు చేయించారు. దీనివల్ల వరి పంటలో దోమపోటును సమర్ధవంతంగా నివారించవచ్చని అలాగే అన్ని పంటల్లో రసం పీల్చు పురుగులను నివారించుకోవచ్చన్నారు. పంట ఆరోగ్యంగా ఉండడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. కావున ప్రకృతి సేద్యం చేసే రైతులంతా ఈ కషాయాన్ని తయారు చేసుకుని నిల్వ ఉంచుకోవాలని సూచించారు.

రోడ్లపై మురుగునీరు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిల మేజర్ పంచాయతీ పరిధిలో గల హడ్కో కాలనీ దళిత వీధిలో రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలతో ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు సమస్య తెలియజేసినా పరిష్కరించడంలేదని సిపిఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం సిపిఎం మండల కమిటీ సభ్యులు గవర వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు వై.రామారావు, పి.చిన్నారావు కాలనీలోని రోడ్లు పరిశీలించారు. కాలనీలో ఏ వీధిలోనూ సరైన మురుగు కాలువల్లేవని, ఉన్న చోట పూర్తిగా మూసుకుపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు నిలిచిపోతుందని అన్నారు. తద్వారా దోమలకు ఆవాసాలుగా మారాయని, ప్రజలు మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులకు గురికావాల్సి వస్తుందన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి వారంలో సమస్యకు పరిష్కారం చూపాలని, లేకుంటే బాధితులతో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బొంగు గురువులు, పోతుల పార్వతమ్మ, గుడిసి అప్పలస్వామి, పల్లికల రాము, నారాయణమ్మ, గంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే ఆరోపణలు : వైసిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అభివృద్ధిపై ప్రశ్నించినప్పుడల్లా ప్రజల దృష్టిని మరల్చేందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై సిఎం చంద్రబాబునాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని వైసిపి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ అన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం పడిపోతున్నా చంద్రబాబుకు పట్టడం లేదన్నారు. బెల్ట్ షాపులు నియంత్రిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం అమలు చేయకుండా వీధికో బెల్టు షాపు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నియంత్రించకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల్లో ఏనాడు పొత్తు లేకుండా పోటీ చేసిన దాఖలు లేని చంద్రబాబు కూడా సింగిల్‌గా విజయం సాధించిన జగన్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేసారు. ప్రతి గ్రామంలో నకిలీ మద్యం తయారు చేసే కుటీర పరిశ్రలను ఏర్పాటు చేశారని మండిపడ్డారు. వీధికో బెల్టు షాపు ఏర్పాటు చేసి రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతున్నా చంద్రబాబు విజనరీ ఏమైందని ప్రశ్నించారు.

పువ్వలకు ఘన నివాళి

ప్రజాశక్తి - సాలూరు



పువ్వలకు నివాళ్లు అర్పిస్తున్న వైసిపి నాయకులు

అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పువ్వుల నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు వైసిపి నాయకులు నివాళులర్పించారు. మంగళవారం ఆయన పెద్ద కర్మ సందర్భంగా లక్ష్మీ థియేటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, వైసిపి జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు కస్తూరి రామకృష్ణ, కొల్లి వెంకటరమణ, పిరిడి రామకృష్ణ, కాకి పాండురంగ, ఎం.అప్పారావు, మద్ది గోవింద రావు పాల్గొన్నారు.



బోల్తాపడిన ట్యాంకర్

ఘాట్ రోడ్‌లో గ్యాస్ ట్యాంకర్ బోల్తా

ప్రజాశక్తి పాచిపెంట

మండలంలోని ఆంధ్రా- ఒడిశా ఘాట్ రోడ్డు రొడ్డవలస వద్ద గ్యాస్ ట్యాంకర్ సోమవారం రాత్రి బోల్తాపడింది. విశాఖ నుంచి రాయగడ మీదుగా జార్ఖండ్ వెళ్తున్న ఇండియల్ ఎల్‌పి గ్యాస్ ట్యాంకర్ రామభద్రపురం జంక్షన్ వద్ద డ్రైవర్ మహ్మద్ మహుబూబ్ దారి తప్పి బొబ్బిలి మార్గంలో వెళ్లాల్సి ఉండగా, దారి తప్పి సాలూరు మీదుగా ఆంధ్ర, ఒడిశా ఘాట్ మీదుగా వెళ్తున్నారు. కొంత దూరం వచ్చాక దారి తప్పినట్టు తెలుసుకొని రొడ్డవలస జంక్షన్ వద్ద లారీని మలుపు తిప్పాడు. ఈ సమయంలో లారీ అదుపు తప్పి ఘాట్‌రోడ్డు లోయలోకి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు సంఘటనా స్థలానికి జిల్లా అగ్నిమాపకాధికారి పి.సింహాచల, సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, స్థానిక పోలీసులు చేరుకొని ఆరు క్రైన్ల సహాయంతో మంగళవారం ఉదయం లారీని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే సాధ్యంకాక పోవడంతో బుధవారం కూడా సహాయక చర్యలు చేపట్టనున్నట్టు రూరల్ సిఐ తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా మూడు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.